క్లుప్తంగా

నవదుర్గమ్మ ఆలయ ఆదాయం రూ.3.10 లక్షలు



హుండీల్లోని కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ ఆలయ హుండీల ఆదాయం మంగళవారం లెక్కించినట్లు ఈవో పి.శ్యామలరావు తెలిపారు. ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, సూపర్‌వైజర్ బీవీ మాధవరావు సమక్షంలో హుండీలు తెరిచి లెక్కించగా 43 రోజులకు గాను రూ.3,10,170లు సమకూరిందన్నారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసరావుశర్మ, రంపా రామచంద్రరావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహనదారుడి లైసెన్స్ పరిశీలిస్తున్న ఎస్ఐ గోపాలరావు

సంతకవిటి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎస్ఐ ఆర్.గోపాలరావు తన సిబ్బందితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు.

హిందీ పరీక్షా ఫలితాల విడుదల

రాజాం: తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకి చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలన్నీ సెప్టెంబరు నెలలో జరిగాయని, ఆ పరీక్షల ఫలితాలను ఇప్పుడు సంస్థ విడుదల చేసిందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9949917365ను సంప్రదించాలని కోరారు.

మద్య బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి: మండలంలోని ఎ.వెలగవలసకు చెందిన జక్కు లక్ష్మణరావు మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ జి.భాస్కరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో 28 మద్యంసీసాలున్న సంచితో పాత బొబ్బిలి వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా మాటు వేసి పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏయే దీర్ఘకాలిక వ్యాధులకు ఏ మందు బాగా పనిచేస్తుందో వైద్యాధికారి సునీల్‌కుమార్ వివరించారు. ఉచితంగా అందజేసే ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పొలం పిలుస్తోంది'

బాడంగి/బొబ్బిలిరూరల్/వంగర: మండలాల్లోని పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది అంతా ఏ నేలలో ఏ రకమైన పంటలు పండిస్తే అధిక దిగుబడులు వస్తాయి.. ఏయే పంటలకు ఏయే తెగుళ్లు, చీడపీడలు సోకుతాయి, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

వెండర్లకు పనులిస్తే ఊరుకోం..



సమావేశంలో ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైస్ ఎంపీపీలు

- వాడీవేడిగా రేగిడి మండల సర్వసభ్య సమావేశం
- 'ఉపాధి' పనుల్లో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల మండిపాటు
- తీరు మార్చుకోవాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సూచన

రేగిడి: సర్పంచ్‌లను కాదని, వెండర్లు(కాంట్రాక్టర్లు)కు ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులను అప్పగిస్తే ఊరుకోమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులంతా అధికారులను హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. తొలుత ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన చర్చలో ఏపీవో హరనాథరావు మాట్లాడుతుండగా, పలువురు సర్పంచ్‌లు జోక్యం చేసుకుని, పంచాయతీల తీర్మానం లేకుండా వేరే వ్యక్తుల(వెండర్లు/కాంట్రాక్టర్లు)కు ఉపాధి పనులను ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులతో పాటు సర్పంచ్ వావిలపల్లి శశిభూషణరావు తదితరులంతా కలిసి వెండర్లతో అభివృద్ధి పనులు చేయించేందుకు అధికారులు సన్నద్ధమవ్వడంపై ధ్వజమెత్తారు. గ్రామ పంచాయతీల అధికారాన్ని నిర్వీర్యం చేస్తే చూస్తూ ఉండమన్నారు. మండలంలో 130 పనులను సర్పంచ్‌ల తీర్మానం లేకుండా ఎలా మంజూరు చేశారని ఎంపీడీవో శ్యామలా కుమారిని నిలదీశారు. 31 పంచాయతీల్లో వెండర్ల ఏర్పాటుపై అత్యుత్సాహం చూపించడాన్ని తప్పుబట్టారు. ఇదే విషయంపై ఎమ్మెల్సీ స్పందిస్తూ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. గ్రామ పంచాయతీలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించవద్దని హితవు పలికారు.

న్యాయ పోరాటానికి దిగుతాం..

సర్పంచ్‌ల తీర్మానాల ప్రాప్తికే పనులు కేటాయించాలని, లేకపోతే సర్పంచ్‌ల ద్వారా న్యాయపోరాటానికి దిగుతామని స్పష్టం చేశారు. తమ చేతిలో ఏమీ లేదని, జిల్లా అధికారులే నిధులు మంజూరు చేస్తున్నారని ఎంపీడీవో సమాధానమిచ్చారు. అలా అయితే సర్పంచ్‌లను సమావేశాలకు ఎందుకు పిలవాలని సర్పంచ్‌లు బంకి చంద్రశేఖర్, వావిలపల్లి చంద్రశేఖర్‌లు అధికారులను ప్రశ్నించారు. మండల విద్యావ్యవస్థపై జరిగిన చర్చలో ఎంఈవో ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతుండగా.. ఎమ్మెల్సీ కలుగజేసుకుని, పలు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట నిర్వాహకులను మార్చి, కొత్తవారిని నియమించడం ద్వారా వివాదాలు సృష్టించడంపై ఎంఈవోను నిలదీశారు. కందిశలో కొత్తగా ముగ్గురిని పెట్టి, ఎలా వంటలు వండిస్తారన్నారు. రెవెన్యూ శాఖ సమీక్షలో కొర్లవలస గ్రామంలో ఇనాం భూములకు సంబంధించి, రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు అందజేయాలని కొర్లవలస పంచాయతీ సర్పంచ్ బంకి హరినాధరావు.. తహసీల్దారు ఎల్లారావును కోరారు. గ్రామంలో 750 మంది రైతులకు 830 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని, వాటిపై రైతులకు పూర్తి హక్కు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, గృహ నిర్మాణ, ఐసీడీఎస్ శాఖలపై సమీక్షించారు. ఇదిలా ఉండగా, ఈ సమావేశానికి కేవలం సభ్యులను మాత్రమే లోపలకు అనుమతించారు. అయితే ఎటువంటి పదవులు లేని టీడీపీ కార్యకర్తలు సమావేశ మందిరానికి చేరుకోవడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. ఎటువంటి పదవులు లేని వారిని సమావేశ మందిరం దగ్గర నుంచి బయటకు పంపించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బొబ్బిలి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇంజినీరింగ్, ఏఈలతో మంగళవారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. పల్లె పండగ కార్యక్రమంలో గుర్తించిన పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సర్పంచ్‌లు, వెండర్ల పరస్పర అంగీకారంతో పనులను వేగవంతం చేసి, నిర్దేశిత సమయంలోగా ఆ పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఎం.బుక్‌ల నిర్వహణలో జాగ్రత్త వహించాలన్నారు. సమావేశంలో జేఈలు రమేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డీఈఈ అప్పారావు

బాడంగి: మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 46,062 మ్యాన్ డేస్ పనులు కల్పించేలా మ్యాపుల ఆధారంగా చూపించి, చైతన్యం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ శ్రీనివాసరావు, ఏపీఎం విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులంతా హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: మండలంలోని పిట్టాడ గ్రామం వద్ద పలు అభివృద్ధి పనులకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం భూమిపూజ చేసి, పనులకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించారు. ఉపాధి హామీ పథకం నిధులతో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రస్తుతం గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు క్రీడలపై మక్కువ పెంచేలా క్రీడా మైదానాలు నిర్మించాలని సూచించారు. అనంతరం జరిగిన సమావేశం టీడీపీ సమావేశంలా జరిగింది. ఎంపీపీ మినహా టీడీపీ నాయకులతోనే స్టేజి నిండిపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమా.. లేక టీడీపీ సమావేశమా అని చెవులు కొరుక్కుంటున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా సర్పంచ్‌లకిచ్చే గౌరవం?



వెండర్ రిజిస్ట్రేషన్‌కు పంచాయతీ నుంచి తీర్మానం ఇవ్వకుండానే టీడీపీ నాయకుడి పేరును కాంట్రాక్టరుగా శిలాఫలకంపై వేయించుకున్నారని, సర్పంచ్‌లు, పంచాయతీ వ్యవస్థకు ఇస్తున్న గౌరవం ఇదేనా అని సర్పంచ్ కాపరపు పైడిపునాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పంచాయతీలను బలోపేతం చేస్తాం, సర్పంచ్‌లను గౌరవిస్తాం అంటూ ఉదరగొట్టే ప్రసంగాలు చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వీటిపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు.

– పైడిపునాయుడు, సర్పంచ్, పిట్టాడ

విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని.. పెంచుతారా?



కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాసరావు

బొబ్బిలి: అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి, ఇప్పుడు పెంచేందుకు సిద్ధమయ్యారా అని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మువ్వల శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలపై భారం పడే నిర్ణయాలు తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన మానుకోవాలన్నారు. ఇప్పటివరకు మొదటి నెల బిల్లు రెండో నెలలోనైనా చెల్లించుకునే వెసులుబాటు ఉండేదని, ప్రస్తుతం తీసుకువస్తున్న స్మార్ట్‌మీటర్‌ల విధానం ద్వారా రీచార్జ్ చేసుకుంటే తప్ప విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు లేవన్నారు. ఇలాంటి తప్పుడు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

హత్య కేసు నిందితుడికి రిమాండ్!

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బాబానగర్‌కు చెందిన వృద్ధురాలు బత్తుల యశోద(62) మృతికి కారణమైన నిందితుడికి రిమాండ్ విధించినట్లు సమాచారం. ఈ నెల 10వ తేదీ రాత్రి వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో మృతురాలి కొడుకు బత్తుల గిరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమనాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ ఘటనకు సంబంధించి, చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు దర్యాప్తు నిర్వహించారు. ఈ కేసులో అనుమానితుడైన మున్సిపాలిటీ పరిధిలోని వంజరాంపేటకు చెందిన బి.శ్యామ్‌ను రాజాం పోలీసులు అరెస్ట్ చేసి, విచారించినట్లు తెలిసింది. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో పాటు పాలకొండ సబ్‌జైలుకు తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు మీడియాకు ఇంకా వెల్లడించలేదు.

డ్రోన్‌తో బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు

రాజాం సిటీ: ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక చీపురుపల్లి రోడ్డులోని గాయత్రి కాలనీ వద్ద డ్రోన్ సహాయంతో బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు మంగళవారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తిస్తున్నామని తెలిపారు. మండలంలోని గురవాం, పొగిరి, కంచరాం ప్రాంతాల్లోని అటువంటి స్థలాలు గుర్తించామని, ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. వాహనదారులు కూడా మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ కె.అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

తెర్లాం: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుంటున్నట్లు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికిరణ్ తెలిపారు. మండలంలోని సతివాడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరైన ఆయన.. రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన రీసర్వే తర్వాత ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సదస్సులో సర్పంచ్ జానకీరాంప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు అడ్డుకోవాలి

వంగర: స్థానిక పాత సబ్‌సెంటర్ భవనం దగ్గరలో చేపడుతున్న అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని స్థానికులు కె.సత్యంనాయుడు, కె.శంకరరావు, కె.పారినాయుడు కోరారు. ఇదే విషయమై తహసీల్దారు దిరిశాల ధర్మరాజుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో గ్రామానికి చెందిన కె.రవి చేపడుతున్న నిర్మాణం నిలుపుదల చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై తహసీల్దారు ధర్మరాజు వద్ద సాక్షి ప్రస్తావించగా, దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని వీఆర్‌వోను ఆదేశించినట్లు తెలిపారు.

డ్వాక్రా బజారు ప్రారంభం

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారును ఎమ్మెల్యే బేబీనాయన మంగళవారం ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఈ బజారులో విక్రయించనున్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



రామభద్రపురం నుంచి సాలూరు వెళ్లే జాతీయ రహదారి పక్కన, కొట్టక్కి జంక్షన్‌కు సమీపంలో ఓ విద్యుత్ స్తంభం అక్కడి పొలాల్లోకి ఒరిగిపోయి అత్యంత ప్రమాదకరంగా కనిపిస్తోంది. చేతికి అందినంత ఎత్తులోనే ఉండడంతో ఏ క్షణంలో ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరికోతలు, పొలానికి నీరు కట్టడం వంటి పనులు జరుగుతున్నాయని ఎవరికీ ఎలాంటి హాని కలగకముందే అధికారులు అప్రమత్తమై, స్తంభాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

– రామభద్రపురం

గోతులు పూడ్చరూ?



నిత్యం ప్రయాణీకులు, వాహనాల రాకపోకలతో అత్యంత రద్దీగా ఉండే రాజాం–రామభద్రపురం అంతర్ రాష్ట్ర రహదారి ప్రస్తుతం అధ్వానంగా తయారైంది. తెర్లాం మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం దాటిన దగ్గర నుంచి ఉత్తరావల్లి జంక్షన్ వరకు రోడ్డు అంతా పూర్తిగా గోతులమయమైంది. దీంతో ఆ వైపుగా ప్రయాణాలు చేసేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఈ గోతుల కారణంగా చాలా వాహనాలు బోల్తాపడిన ప్రమాదాలు జరిగాయని అయినా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాన్నారు. ఇప్పటికైనా గోతులు పూడ్చి, ప్రయాణాలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

– తెర్లాం

సంక్షిప్తంగా..

దీపం–2 లబ్ధిదారులకే సబ్సిడీ గ్యాస్

రాజాం సిటీ: గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతీ లబ్ధిదారునికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్న కూటమి ప్రభుత్వం మరో మోసానికి తెరలేపింది. ఇప్పుడు దీపం–2 కనెక్షన్లు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తించేలా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి మంగళవారం నుంచి బుకింగ్స్ ఓపెన్ కావడంతో లబ్ధిదారులంతా బుకింగ్స్ చేసుకుంటున్నారు. దీపం–2 పథకం కింద గ్యాస్ బుకింగ్ చేసుకున్న వారికి ఈ నెల 31న సబ్సిడీ గ్యాస్ అందించనున్నామని సీఎస్ డీటీ చిరంజీవరావు మంగళవారం తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు బుకింగ్ చేసుకున్న వారికి ఒక సిలిండరు అందజేయడంతో పాటు పూర్తిస్థాయి సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఇందుకు గాను తెల్లరేషన్ కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఆధార్ బ్యాంకు అకౌంట్‌కు లింకేజీ అయితేనే సబ్సిడీ రెండు రోజుల్లో పడుతుందన్నారు. 29 అక్టోబర్ నుంచి 2025 మార్చి 31 వరకు ఒక సిలిండర్, ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు రెండో సిలిండర్, ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు మూడో సిలిండర్ అందుతుందని పేర్కొన్నారు. ఈ ప్రకారం ఒక ఏడాది సిలిండర్లకు అప్పుడే ఎగనామం పెట్టిందని ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించండి

బొబ్బిలి: జనాభా ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు పొట్నూరు శంకరరావు కోరారు. ఇదే విషయమై పారిశుధ్య కార్మికులతో కలిసి మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి, కమిషనర్ ఎల్.రామలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న జనాభాకు సరిపడ పారిశుధ్య సిబ్బంది లేని కారణంగానే పారిశుధ్య లోపం తలెత్తుతోందని తెలిపారు.

వెండర్ విధానం తీసుకురావడం దారుణం

బొబ్బిలి: ఉపాధి హామీ పథకం చట్టం ఉల్లంఘిస్తూ కూటమి ప్రభుత్వం వెండర్ విధానం తీసుకురావడం దారుణమని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోదరరావు అన్నారు. ఇదే విషయమై ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీల్లో సర్వాధికారాలు కలిగిన సర్పంచ్‌లను కాదని వెండర్(కాంట్రాక్టర్)లకు ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులను అప్పగించడం సరికాదన్నారు. గతంలో ఉన్న నిబంధనల ప్రకారమే ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనులు నిర్వహించాలని కోరారు.

రక్తదానానికి ముందుకురావాలి

రాజాం సిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అటువంటి రక్తదానానికి యువత ముందుకురావాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి, కాసేపు మాట్లాడారు. సామాజిక స్పృహతో రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రమాదాల బారిన పడిన ఎంతోమందికి సమయానికి రక్తం అందక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రక్తదానం వల్ల ఆరోగ్యమే తప్ప అనారోగ్యం ఉండదన్నారు. రక్తదాతల నుంచి 43 యూనిట్ల రక్తం సేకరించినట్లు రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.